


నేను రైలు కిటికీ వెంబడి చూస్తూండగానే అంత వరకూ ఆకాశంలో ఎక్కడ వున్నదో ఒక చుక్క, ఏటవాలుగా భూమిలోకి కూరుకు పోయింది. ఆ రోజు బామ్మ ధైర్యంగా అలా చేయకుండా వుంటే, నేను బామ్మకంటే ముందే ఆ చుక్కలా రాలి పోదునేమో!!

అమ్మా, నాన్న నేను ప్రేమించిన వ్యక్తితో నా పెళ్ళికి అంగీకరించలేదు. నన్ను కొన్ని రోజులు దూరంగా వుంచాలని, బామ్మ తోడుగా మామయ్య ఇంటికి పంపేశారు. ఆటోలో వెళ్తున్నంత సేపూ నేను బామ్మను తిడుతూనే వున్నాను. 'కాటికి కాళ్ళు చాపుకున్న దానివి, మమ్మల్ని విడదీసి ఎందుకు పాపం మూటకట్టుకుంటావ్' అని నేనంటే, నవ్వుతూ నా వైపు చూసిందంతే.

నేను కళ్ళు తుడుచుకుంటూ, అరుస్తూండగానే ఆటో ఆగింది.

కానీ రైల్వే స్టేషన్‌లో కాదు. అర్థంకాక నిలబడిపోయిన నన్ను చేయి పట్టుకుని లోపలికి లాక్కెళ్ళింది.

ఆ రోజు రాత్రి మా పెళ్ళి జరిగిపోయింది! బామ్మ అంత ధైర్యం చేస్తుందనుకోలేదు.

ఇది జరిగి సంవత్సరమయింది!

ఈ సంవత్సరం బామ్మ నరకం అనుభవించింది. ఇంటికి వెళ్ళిన బామ్మను అమ్మా, నాన్న నానా మాటలన్నారు. నా కూతుర్ని కులంకాని వాడికిచ్చి పెళ్ళిచేసే అధికారం నీ కెవరిచ్చారంటూ నిలదీశారు. నాన్న మాట్లాడటం మానేశాడని తెలిసింది. అమ్మ రోజూ సూటీపోటీ మాటలనేదట.

మృత్యుముఖంలో, మానసికంగా ఒంటరి అయిన సమయంలో, చుట్టూ వున్న మనుషులు కూడా ఒంటరితనాన్ని కలిగిస్తే, ముసలి మనసెంత బాధ పడి వుంటుందో అర్థం చేసుకోగలను. నరకం నుంచి బామ్మ తొందరగానే వెళ్ళిపోయిందనుకోవాలి.

బామ్మ పోయినట్టు ఈ రోజు ఉదయమే మా వారి ఇంటి నుంచి టెలిగ్రాం వచ్చింది. పెళ్ళయింతర్వాత ఊరికి రావడం ఇదే మొదటిసారి. కాపురం వేరే ఊర్లో పెట్టమని బామ్మే చెప్పింది మాకు!

xxx

రైల్వే స్టేషన్ నుంచి ఇంటికెళ్ళేటప్పటికి చీకటి పల్చగా అలుముకుంటోంది! వెలుగుతోపాటే బామ్మ పార్థివదేహం కూడా వెళ్ళిపోయింది. ఇంట్లోకెళ్ళగానే బామ్మ కూర్చునేచోట ఖాళీగా కనిపించడంతో ఏడుపు ఆపుకోలేకపోయాను. నన్నెవరూ పలకరించలేదు!

సోఫాలో కూర్చున్న నాకు అమ్మ మాటలు వినిపించాయి. "వచ్చింది చుట్టపు చూపుగా కాదు గదా?" – అంటే? నన్నిక వెళ్ళిపొమ్మని! నా కేమీ బాధనిపించలేదు. వెళ్ళిపోబోయే ముందు బామ్మ గదిలో కెళ్ళాను.

గదిలో వున్నది చాలా కొద్ది వస్తువులే అయినా పొందికగా అమర్చుకుని వుంది. పుస్తకాలున్న అల్మరా తెరిచాను. పాత కాలం నాటి పుస్తకాలు. లావుపాటి నోట్‌బుక్ ఒకటి కనిపించింది. ముట్టుకుంటేనే చిరిగేంత పాతబడి వుంది!

అది మామూలు నోట్‌బుక్ అయినా, బామ్మ దాన్ని డైరీగా వుపయోగించిందని, లోపలి పేజీలు చూస్తే తెలిసింది. చెదలు పట్టి అంచులు చిరిగిపోవడంతో చాలా తారీఖులు స్పష్టంగా లేవు.

ఒక పేజీలో ఇలా వుంది!

"1942, ఆగస్టు."

ఈ రోజు చంద్రశేఖర్ గొప్పగా మాట్లాడాడు. నెహ్రూ క్విట్ ఇండియా ఉద్యమానికి పిలుపునిచ్చాడని, తాను త్వరలోనే వెళ్ళి ఉద్యమంలో పాల్గొనాలని అన్నాడు. చంద్రశేఖర్‌ని మరచిపోలేకుండా వున్నాను. చంద్రశేఖర్ చెప్పిన విషయాల వల్లనే నేను అందరి అమ్మాయిల్లా కాకుండా, గొప్పగా ఆలోచించగలుగుతున్నాను. నాకు చాలా ఆనందంగా వుంది. చంద్రశేఖర్ నన్ను పెళ్లిచేసుకుంటే ఎంత బావుండును?"

మరో పేజీలో

"నేను, నువ్వు ఒకర్నొకరు ప్రేమించుకోడానికి ముందు ఈ దేశాన్ని ప్రేమించాలి! నేను ఈ రోజే వెళ్ళిపోతున్నాను. మనకు స్వాతంత్ర్యం వచ్చాక తిరిగి వస్తాను. లేదంటే స్వాతంత్ర్యం కొరకు చివరి వరకు పోరాడతాను. అప్పటివరకు నన్ను ఎదురుచూడమని కోరను. అబ్బ! ఎంత గొప్ప మాటలు. చంద్రశేఖర్ గొప్ప దేశభక్తుడు. అతని కోసం ఎన్ని యుగాలయినా ఎదురుచూడవచ్చు. చంద్రశేఖర్ తిరిగి వచ్చేవరకు ఇలాగే వుంటాను"

మరొక పేజీలో

"నిజంగా నా కింత ధైర్యం ఎలా వచ్చిందో నాకే అర్థం కావటం లేదు. వేరే కులానికి చెందిన చంద్రశేఖర్‌ను పెళ్లిచేసుకుంటానని, ఎన్ని రోజులయినా అతని కోసం ఎదురుచూస్తానని అమ్మా, నాన్నతో చెప్పేశాను. ఈ ధైర్యమంతా చంద్రశేఖర్ మాటల వల్ల కలిగిందే! నాన్నకు నా మీదున్న ఇష్టం కొద్దీ ఏమో, నన్నేం అనలేదు. ఆశ్చర్యంగా వుంది. అమ్మ కొట్టినంత పని చేసింది. ప్రకాశం బావ మింగేసేలా చూస్తున్నాడు."

కొన్ని పేజీలు మామూలు విషయాలతో నిండివున్నాయి.

మరో పేజీలో

